సాక్షి అనంతపురం

మంగళవారం । 15 । జూలై । 2025



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



...పెన్షనర్ల దిగాలు

కూటమి ప్రభుత్వ తీరుతో ప్రభుత్వ పెన్షనర్లు కన్నీరు పెడుతున్నారు. కలెక్టరేట్ ఎదుట నేడు ధర్నాకు పిలుపునిచ్చారు.

8లో

గరిష్టం/కనిష్టం

37.1°/22.8°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

హెచ్చెల్సీకి నవంబర్ నెలాఖరు వరకూ నీరు

- టీబీ డ్యాం ఎస్ఈ నారాయణ నాయక్



రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న టీబీ డ్యాం ఎస్ఈ నారాయణ నాయక్

బొమ్మనహాళ్: హెచ్చెల్సీకి నవంబర్ నెలాఖరు వరకు తుంగభద్ర జలాలను విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని టీబీ డ్యాం ఎస్ఈ నారాయణ నాయక్ తెలిపారు. సోమవారం బొమ్మనహాళ్ మండలం ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద కాలువను, రెగ్యులేటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టిందన్నారు. ఇటీవల డ్యాం నుంచి 1,400 క్యూసెక్కుల నీటిని హెచ్చెల్సీకి వదిలామన్నారు. 105వ కిలోమీటర్ వద్దకు 500 క్యూసెక్కుల మేర వస్తున్నట్లు తెలిపారు. నవంబర్‌లో వర్షాలు వస్తే హెచ్చెల్సీకి నీటి వాటా పెంచుతామన్నారు. ఆంధ్రాలో అత్యవసర మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో నీటిని తీసుకునేందుకు అలస్యం కావొచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీఈ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జేఈ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్ ప్రవేశాలకు 16న కౌన్సెలింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సీట్ల భర్తీకి ఈనెల 16న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సమన్వయ అధికారి జయలక్ష్మీ తెలిపారు. కురుగుంట స్కూల్‌లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. పదో తరగతికి సంబంధించి ఉరవకొండ స్కూల్‌లో ఎస్టీ-1, బీసీ-1, ఓసీ-1, హిందూపురం బాలికల పాఠశాలలో ఎస్సీ-7, అమరాపురంలో ఎస్టీ-1, ఓసీ-1, మలుగూరులో ఎస్సీ-2, ఎస్టీ-1 ఖాళీలున్నాయన్నారు. సీనియర్ ఇంటర్‌లో ఉరవకొండ ఎస్సీ-48, ఎస్టీ-3, బీసీ-3, ఓసీ-2, నల్లమాడలో 55, కురుగుంటలో ఎస్సీ-1, ఎస్టీ-2, బీసీ-2, హిందూపురం (బాలికలు)లో ఓసీ-1, అమరాపురం ఎస్సీ-1, ఓసీ-1, మలగూరులో ఎస్సీ-19, బీసీ-1 సీటు ఖాళీ ఉందన్నారు.

16 ఎకరాల్లో పత్తి పంట దున్నేసిన రైతు



పత్తి పంటను దున్నేసిన రైతుతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యాడికి: వర్షాభావంతో పంట చేతికి అందకుండా పోతోందనే ఆవేదనతో ఓ రైతు 16 ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంటను ట్రాక్టర్ సాయంతో దున్నేశాడు. యాడికి మండలం చిక్కేపల్లి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రైతు బాదుల్లా తనకున్న 3 ఎకరాలతో పాటు సమీపంలోని రైతులకు చెందిన 13 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. పెట్టుబడి కింద రూ.2 లక్షల వరకు ఖర్చు పెట్టాడు. వర్షం జాడ లేకపోవడంతో పంట ఎదుగుదల లేకుండా పోయింది. దీంతో మనస్తాపానికి గురైన బాదుల్లా తన భార్యతో కలసి ట్రాక్టర్‌తో పత్తి పంటను తొలగించాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వెంకట్రామిరెడ్డి, మండల కన్వీనర్ సంజీవరాయుడు, నాయకులు అక్కడకు చేరుకుని బాదుల్లాతో మాట్లాడారు. తహసీల్దార్ ప్రతాపరెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని విన్నవిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివుడు, ఆదినారాయణరెడ్డి, చిక్కేపల్లి గ్రామ నాయకులు అశోక్‌రెడ్డి నారాయణరెడ్డి, దేవనాథరెడ్డి, ఈశ్వరరెడ్డి, బయపురెడ్డి పాల్గొన్నారు.

అవార్డుల దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఈ ఏడాది జాతీయస్థాయి అవార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 16 వరకు గడువు పొడిగించినట్లు డీఈఓ ఎం. ప్రసాద్‌బాబు తెలిపారు. పదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ పొందుపరిచిన మార్గదర్శకాలు డీఈఓ బ్లాగ్‌లో ఉంచినట్లు వెల్లడించారు. దరఖాస్తు కోసం nationalawardstoteacher. education. gov. in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు. మ్యానువల్ దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ధ్రువీకరణ అధికారి ద్వారా హార్డ్ కాపీలపై ధ్రువీకరించుకుని డీఈఓ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

పర్యవేక్షణ కరువై పెడదారి

- వారం క్రితం అనంతపురం రూరల్ పరిధిలోని నారాయణపురం చెక్‌డ్యాం సమీపంలో తపోవనం హైస్కూల్ పిల్లలు ఐదుగురు మద్యం తాగుతున్నారు. ఆ బ్యాచ్‌లోని ఓ విద్యార్థి తండ్రి వీరి తతంగాన్ని కనిపెట్టాడు. తన కుమారుడిని పట్టుకొచ్చి బాగా కొట్టాడు. దీంతో ఆ విద్యార్థి అందరి పేర్లూ చెప్పాడు. విస్కీ తాగినట్టు వెల్లడించాడు.
- అనంతపురం నగరంలోని పొట్టిశ్రీరాములు పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థి.. ఇటీవల స్కూల్లో టీసీ తీసుకుని 3వ రోడ్డులో ఉన్న ఓ హైస్కూల్‌లో చేరాడు.బడిలో ఈ విద్యార్థి ఇటీవల గంజాయి తాగుతుండగా ఉపాధ్యాయుడు గుర్తించాడు. తల్లిదండ్రులను పిలుస్తా అని హెచ్చరిస్తే.. ''పిలువు, నన్ను వాళ్లేం చేయగలరు'' అంటూ విద్యార్థి ఎదురుతిరిగే సరికి ఉపాధ్యాయుడు భయపడి విషయాన్ని అంతటితో వదిలేశాడు. విద్యార్థుల్లో పెడ ధోరణలు ఎంతగా పెరిగాయో ఈ రెండు ఘటనల ద్వారా అర్థం చేసుకోవచ్చు.



విద్యార్థుల్లో వింత పోకడ

- ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులే ఎక్కువగా పక్కదారి
- వారం క్రితం నారాయణపురం వద్ద లిక్కర్ తాగుతూ దొరికిన ఐదుగురు
- మరో ప్రభుత్వ స్కూల్లో 9వ తరగతి విద్యార్థి గంజాయి సేవనం
- ఎక్కువగా అర్బన్ ప్రాంతాల్లో ఇలాంటి విపరీత ఘటనలు
- ఉదాసీనంగా ఉపాధ్యాయులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రభుత్వ స్కూళ్లలో పెరుగుతున్న విపరీత ధోరణులు అందరినీ విస్మయానికి గురి చేస్తున్నాయి. చిన్న వయసులోనే ఇలాంటి ఆలోచనలు ఎలా వస్తున్నాయన్నది ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ హైస్కూళ్లలో ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం, ఉపాధ్యాయులు కూడా తమకెందుకులే అని పట్టించుకోకపోవడం తదితర కారణాలతో పిల్లలు పెడదారి పడుతున్నట్లుగా తెలుస్తోంది.

14 ఏళ్లకే మద్య సేవనం...

తపోవనం హైస్కూలు విద్యార్థులు మద్యం సేవించిన ఘటన జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ముగ్గురు, ఎనిమిదో తరగతి చదువుతున్న వారు ఇద్దరు ఉన్నట్లు తెలుసుకుని పలువురు విస్తుపోతున్నారు. మరోవైపు జిల్లాలో కొన్ని చోట్ల విద్యార్థులు పాఠశాలలకు గంజాయి తెచ్చుకుని సేవిస్తున్నారు. మరి కొన్ని చోట్ల సెల్‌ఫోన్లలో అశ్లీల చిత్రాలు చూస్తూ గడుపుతున్నారు. కో ఎడ్యుకేషన్ ఉన్నచోట బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇటీవల ఓ ప్రభుత్వ స్కూల్‌లో 9వ తరగతి బాలిక ఓ బాలుడికి ప్రేమలేఖ రాసిన ఉదంతం బయటపడింది. ఈ క్రమంలో పిల్లలను స్కూళ్లకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉపాధ్యాయుల్లో ఉదాసీన వైఖరి

పిల్లలను ఏమంటే ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనన్న భయంతో ఉపాధ్యాయులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. చాలామంది టీచర్లే క్రమశిక్షణ తప్పి క్లాసులకు వస్తున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. సమయానికి స్కూలుకు వెళ్లకపోవడం, వెళ్లినా క్లాసులు తీసుకోకపోవడం విద్యార్థులు ఇష్టారాజ్యంగా ప్రవర్తించడానికి కారణమవుతోంది. ఇక పిల్లల తల్లిదండ్రులు జీవనోపాధి నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లి ఎప్పుడో రాత్రికి ఇంటికి చేరుకుంటుండడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలు లేక శాపంగా పరిణమిస్తోంది.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



పిల్లల్లో పెడధోరణులను కాండాక్ట్ డిజార్డర్ అంటారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం ప్రధాన కారణం. తల్లిదండ్రులకు మద్యం అలవాటు ఉన్నా ఇలా జరుగుతుంది. మొబైల్ ఫోన్‌లు, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల కూడా పెడదారి పడుతున్నారు. తల్లిదండ్రుల ద్వారానే పిల్లల్లో పరివర్తన రావాలి.

–డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణులు, అనంతపురం

పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు నేడు ఆఖరు

- గడువు పొడిగించాలని కమిషనరేట్‌కు అధికారుల ప్రతిపాదన

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో వాతావరణ బీమా పథకం కింద గుర్తించిన పంటలకు ప్రీమియం చెల్లింపు గడువు మంగళవారంతో ముగియనుంది. బీమా కింద నోటిఫై చేసిన వేరుశనగ ఎకరాకు రూ.640 ప్రకారం ప్రీమియం కట్టాలి. పత్తికి రూ.1,140, దానిమ్మ రూ.3,750, చీనీ, బత్తాయి రూ.2,750, టమాట రూ.1,600, అరటి రూ.3 వేల ప్రకారం జూలై 15లోపు ప్రీమియం కట్టాలని వారం క్రితం వ్యవసాయ శాఖ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకూ ప్రీమియం చెల్లించి ఎంత మంది రైతులు బీమా పరిధిలోకి వచ్చారనే విషయం అధికారులు వెల్లడించలేదు. అయితే, ఇంకా వేలాది మంది చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో నెలాఖరు వరకు గడువు పొడిగించాలని కమిషనరేట్ అధికారులకు జిల్లా వ్యవసాయశాఖ ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఇక ఫసల్‌బీమా కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప పంటలను నోటిఫై చేశారు. ఇందులో కంది రైతులు ఎకరాకు రూ. 80 ప్రకారం, జొన్నకు రూ.84, మొక్కజొన్న రూ.132, ఆముదం రూ.80, ఎండుమిరప రూ.576 ప్రకారం ప్రీమియం చెల్లించాలి. ఈ నాలుగు పంటలకు నెలాఖరు వరకు ప్రీమియం చెల్లింపు గడువు విధించారు. వరి రైతులు రూ.164 ప్రకారం ఆగస్టు 15 వరకు గడువు ఇచ్చారు. ఈ క్రమంలో ఫసల్ బీమాకు ఇబ్బంది లేకున్నా... వాతావరణ బీమాకు గడువు పొడిగించాల్సిన పరిస్థితి నెలకొంది. మొత్తమ్మీద కూటమి సర్కారు, వ్యవసాయ శాఖ బాధ్యతా రాహిత్యం కారణంగా ఈ ఏడాది పంటల బీమా పథకాల ద్వారా లబ్ధి పొందాలంటే రైతులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు

- పోలీసుల తీరుపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత ధ్వజం
- తాడిపత్రి సమావేశానికి వెళ్లొద్దంటూ నోటీసులివ్వడంపై మండిపాటు



అనంతతో మాట్లాడుతున్న తాడిపత్రి సీఐ సాయిప్రసాద్, చిత్రంలో టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా పోలీసు శాఖ వ్యవహరిస్తోందని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన పోలీసులే ఈ విధంగా ఆంక్షలు విధించడం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం తాడిపత్రిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించబోతున్న తరుణంలో.. సమావేశాన్ని వాయిదా వేసుకోవాలంటూ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి నోటీసు జారీ చేశారు. సోమవారం రాత్రి తాడిపత్రి సీఐ సాయిప్రసాద్, అనంతపురం టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ ఏఎస్పీ ఇచ్చిన నోటీసును 'అనంత'కు ఆయన నివాసంలో అందజేశారు. దీనిపై 'అనంత' లిఖిత పూర్వకంగా ఏఎస్పీకి లేఖ పంపారు.

అందులో ఏమన్నారంటే..

'వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా తాడిపత్రిలోని పాత వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించాం. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు తెలియజేశాం. సమావేశానికి ముఖ్యఅతిథులుగా అనంతపురం పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌రెడ్డి, నేను హాజరుకానున్నాం. ఈ సమావేశాన్ని మూడు రోజుల పాటు వాయిదా వేయాలని మీరు సూచించారు. మీరు పేర్కొన్నదాని ప్రకారం ఇదే రోజు వీరాపురం గ్రామంలో నూతన పవర్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం ఉండబోతోంది. ఆ కార్యక్రమానికి మంత్రులు కేశవ్, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, తాడిపత్రి ఎమ్మెల్యే తదితరులు హాజరుకానున్నారు. గతంలో కూడా తాడిపత్రి నియోజకవర్గ సమన్వయకర్త పలుమార్లు అనుమతి కోరిన సందర్భాల్లో, మీ కార్యాలయం తరచూ వాయిదా వేయాలని రాతపూర్వకంగా సమాధానం ఇచ్చిన దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుతం నేను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అనుమతి కోరిన విషయంపై కూడా అదే తరహాలో స్పందించారు. మేము నిర్వహించబోయే కార్యక్రమం హాలులో జరగబోయే ఇండోర్ సమావేశమే. ఇది ఎట్టి పరిస్థితుల్లో బహిరంగ సభ కాదు. ఈ తరహా కార్యక్రమాలకు కూడా అనుమతి నిరాకరించడం, రాజకీయ పార్టీలకు వారి హక్కులు ఉండనివ్వకపోవడం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. ఇలాంటి చర్యలతో తాడిపత్రిని ఒక ప్రత్యేకమైన ప్రాంతంగా భావించి ప్రతిపక్ష పార్టీలకు అనుమతులు తిరస్కరిస్తున్నారన్న అనుమానం మాకు కలుగుతోంది. మేము నిర్వహించే కార్యక్రమం హాలులో, శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతుందని మేము హామీ ఇస్తున్నాం. మా కార్యక్రమానికి అనుమతిచ్చి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి' అని 'అనంత' లేఖలో పేర్కొన్నారు.

నీళ్లడిగితే స్టేషన్‌లో పెట్టారు

- నీటి సమస్య తీర్చాలని మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న మహిళలు
- మంత్రి కేశవ్ ఆదేశాలతో రంగంలోకి పోలీసులు
- మహిళలను స్టేషన్‌కు తీసుకొచ్చి వేధింపులు
- వారికి సలహా ఇచ్చినందుకు టీడీపీ ఎంపీటీసీ సభ్యుడినీ రెండ్రోజుల పాటు స్టేషన్‌లో ఉంచిన వైనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: రెడ్‌బుక్ రాజ్యాంగంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించడమూ తప్పవుతోంది. తాగునీటి సమస్య తీర్చాలని మంత్రిని అడిగినందుకు మహిళలను ఏకంగా పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. నిరసన తెలపాలని వారికి సలహా ఇచ్చారన్న ఉద్దేశంతో అధికార పార్టీకే చెందిన ఎంపీటీసీ సభ్యుణ్ని సైతం రెండ్రోజుల పాటు స్టేషన్‌లో నిర్బంధించారు. కణేకల్లు మండలంలో వెలుగు చూసిన ఈ ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. కణేకల్లు మండలంలోని యర్రగుంట గ్రామంలో ఈ నెల 11న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. ఆయన స్వగ్రామమైన ఉరవకొండ మండలం కొకుంట్ల నుంచి సొల్లాపురం గ్రామం మీదుగా యర్రగుంటకు చేరుకున్నారు. మంత్రి సొల్లాపురం మీదుగా వస్తున్నారన్న విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు కేశవరెడ్డి గ్రామంలోని మహిళలతో చర్చించి.. నీటి సమస్యపై మంత్రిని అడిగితే పరిష్కారం లభిస్తుందని సలహా ఇచ్చారు. దీంతో సుమారు 20 మంది మహిళలు మంత్రి కాన్వాయ్‌కు అడ్డంగా ఖాళీ బిందెలు పెట్టి నిరసన తెలిపారు.దీంతో మంత్రికి కోపం వచ్చింది. వీరిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. పోలీసులు శనివారం మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న మహిళల్లో కొంత మందిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఫోన్లు లాక్కున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచారు. ఇదంతా చేయమని ఎవరు చెప్పారు.. అని ఆరా తీశారు. వారు ఎంపీటీసీ సభ్యుడు కేశవరెడ్డి పేరు చెప్పడంతో పోలీసులు మరుసటి రోజు ఆదివారం నుంచి సోమవారం వరకు రెండ్రోజుల పాటు ఆయన్ను పోలీసుస్టేషన్‌లో నిర్బంధించి వేధించారు. 'సార్..నేనేమీ తప్పు చేయలేదు. ఊళ్లో నీరు రావడం లేదు. మంత్రిని అడిగితే సమస్య తీరుతుందని చెప్పా. ఇంత మాత్రానికి నన్ను ఇబ్బంది పెట్టడం బాధగా ఉంద'ని గోడు వెళ్లబోసుకున్నారు. ఇదంతా మీడియాకు తెలిస్తే పార్టీ పరువు పోతుందని భావించిన టీడీపీ పెద్దలు రంగంలోకి దిగారు. స్థానిక ఎమ్మెల్యే కాలవతో సుదీర్ఘంగా చర్చించారు. ఎంపీటీసీ సభ్యుడిపై కేసు లేకుండా చూడాలని, స్టేషన్ నుంచి పంపించేలా చూడాలని కోరినట్లు సమాచారం. ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పోలీసులు ఎంపీటీసీ సభ్యుణ్ని పంపించేశారు. నీటి సమస్యపై అడిగిన పాపానికి జైల్లో పెట్టించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న శైలజానాథ్, రంగయ్య, నాయకులు

- 'సూపర్ సిక్స్'ను గాలికి వదిలేసిన సీఎం చంద్రబాబు
- మద్యాన్ని నరసమైన ధరలకు ఇస్తానని చెప్పిన ఘనత ఆయనదే
- మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ధ్వజం

పుట్లూరు: ఏడాది కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. సోమవారం ఆయన పుట్లూరులో నిర్వహించిన 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతుల కోసం మాజీ సీఎం వైఎస్ జగన్ వస్తే చంద్రబాబు అండ్ కోకు చెమటలు పట్టి వేలాది మంది పోలీసులతో పర్యటనకు అడ్డంకులు కల్పిస్తున్నారని దుయ్యబట్టారు. 'అన్నదాత సుఖీభవ', 'నిరుద్యోగ భృతి','బీసీలకు 50 ఏళ్లకే పింఛన్', జాబ్ కేలండర్ అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన బాబు.. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా అమలు చేయలేదన్నారు. గత జగనన్న పాలన, ప్రస్తుత కూటమి పాలన తీరుపై చర్చకు సిద్ధమని టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపితే దాడులు చేస్తూ, పోలీసు కేసులు పెడుతూ రాక్షస పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. మద్యాన్ని సరసమైన ధరలకే అందిస్తామని చెప్పడం ఆయనకే చెల్లిందన్నారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి రావడం, ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. చంద్రబాబు దగా పాలనను ఇంటింటికీ వెళ్లి వివరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పి.మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు పిదప సువర్ణ, భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, నాయకులు మడుగుపల్లి నాగేశ్వరరెడ్డి, జయరాంరెడ్డి, శివారెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణస్వామి, రామాంజులరెడ్డి, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో టెన్షన్.. టెన్షన్

తాడిపత్రిటౌన్: పట్టణంలో మరోసారి టెన్షన్ వాతావరణం నెలకొంది. మంగళవారం తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించ తలపెట్టారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నాయి. అయితే, ఇదే రోజు తాడిపత్రి మండలంలోని వంగనూరు వద్ద నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించడానికి మంత్రులు కేశవ్, టీజీ భరత్ హాజరు కానున్నారు. ఈ క్రమంలో రెండు వేర్వేరు కార్యక్రమాలు ఒకే రోజు ఉండడంతో పట్టణంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇదే క్రమంలో వైఎస్సార్ సీపీ కార్యక్రమానికి బందోబస్తు ఇవ్వలేమని, కార్యక్రమ నిర్వహణను మరో రోజుకు మార్చుకోవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి ఏఎస్పీ రోహిత్‌కుమార్ నోటీసివ్వగా.. తాము కూడా ఇప్పటికిప్పుడు కార్యక్రమాన్ని మార్చుకోవడానికి ఇబ్బంది అవుతుందని ఆయన లేఖ రాయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే, వైఎస్సార్‌సీపీ తలపెట్టిన 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరవుతారనే విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తన విదేశీ పర్యటన నుంచి ఆగమేఘాలపై తాడిపత్రికి చేరుకున్నారు. పైగా మహిళా కౌన్సిలర్లు, పార్టీ నాయకురాళ్లు ఉదయం 9 గంటలకు ఇంటి వద్దకు చేరుకోవాలని సోషల్ మీడియా ద్వారా పిలుపునివ్వడం గమనార్హం. ఈ క్రమంలో తాడిపత్రి పట్టణంలోకి పెద్ద ఎత్తున పోలీసులు బలగాలు చేరుకున్నాయి.


వెల్లువెత్తిన వినతులు

- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 800 అర్జీలు
- 'తల్లికి వందనం' అందలేదని, గురుకులాల్లో సీట్లు కేటాయించాలని అధికంగా వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలంటూ అధికారులకు ప్రజలు విన్నవించుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'లో అర్జీలు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై 800 వినతులు అందాయి. అధికంగా 'తల్లికి వందనం', గురుకుల పాఠశాలల్లో సీట్ల కేటాయింపుపై అర్జీలు సమర్పించారు. కలెక్టర్ వి. వినోద్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఆనంద్, రామ్మోహన్, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు.



ఈ వృద్ధురాలి పేరు లక్ష్మీదేవి. వయసు 70 ఏళ్లు. అనంతపురం రూరల్ పరిధిలోని కళ్యాణదుర్గం రోడ్డు సమీపంలోని కాలనీలో నివాసముంటోంది. పింఛను కోసం దరఖాస్తు చేసుకుని ఏడాదవుతున్నా మంజూరు కాలేదని వాపోయింది. తనకు ఎవరూ లేరని, తమ్ముడు మోహన్‌రెడ్డి ఇంట్లో ఉంటున్నానని చెప్పింది. పింఛను మంజూరు చేయించి ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకుంది.

కలెక్టర్‌ను సన్మానించిన అర్జీదారు

సమస్యను పరిష్కరించారంటూ కలెక్టర్ వినోద్ కుమార్‌ను ఓ మాజీ సైనికుడి కుమార్తెలు సన్మానించారు. గుంతకల్లుకు చెందిన మాజీ సైనికుడు మహమ్మద్‌కు 1971లో ప్రభుత్వం ఐదెకరాల భూమి కేటాయించింది. అయితే ఈ భూమి కబ్జాకు గురికావడంతో కలెక్టర్‌కు ఆయన కుమార్తెలు విన్నవించారు. దీనిపై విచారణ చేసిన కలెక్టర్.. భూమిని కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించడంతో పాటు చుక్కల భూమి జాబితా నుంచి తొలగించి ఎన్‌ఓసీ జారీ చేశారు. తమ అర్జీని పరిష్కరించి న్యాయం చేశారంటూ కలెక్టర్‌ను మాజీ సైనికుడి కుమార్తెలు హబీబున్నీసాబేగం, సాహెబేగం సన్మానించారు.

క్లుప్తంగా

వీఆర్‌ఓ నుంచి ప్రాణహాని ఉంది

- గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ



తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న బాధితురాలు షమీమ్‌భాను

గుంతకల్లు టౌన్: వీఆర్‌ఓ నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలంటూ గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులను బాధితురాలు ఆశ్రయించింది. బాధితురాలు తెలిపిన మేరకు... పట్టణంలోని సోఫియా స్ట్రీట్‌లో నివాసముంటున్న షేక్ షమీమ్‌భాను తన మొదటి భర్తతో రెండేళ్ల క్రితం విడాకులు పొంది ఐదేళ్ల కుమారుడితో కలసి తల్లిదండ్రుల సంరక్షణలో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో తన కుమారుడి పేరును రేషన్‌కార్డులో నమోదు చేయించేందుకు సచివాలయానికి వెళ్లిన ఆమెను వీఆర్‌ఓ మహమ్మద్ వలి మాయ మాటలతో లోబర్చుకున్నాడు. ఇంటి స్థలం, ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆమె వద్ద రూ. లక్ష తీసుకున్నాడు. అనంతరం 2024, మే 22న అనంతపురంలో పెద్దల సమక్షంలో ఆమెను పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భిణి. అయితే వీఆర్‌ఓకు ఇదివరకే వివాహమైన విషయాన్ని తెలుసుకున్న ఆమె నిలదీసింది. దీంతో మొదటి భార్య, ఇద్దరు బావమరుదులు షమీమ్‌భాను ఇంటికి చేరుకుని గొడవ చేసి, దుర్భాషలాడుతూ దాడికి తెగబడ్డారు.చంపేస్తామని బెదిరించారు. మహమ్మద్ వలి, ఆయన మొదటి భార్య, అతని బావమరుదుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు, తన తల్లిదండ్రులకు రక్షణ కల్పించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, తదితరులతో కలసి సోమవారం వన్‌టౌన్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. అయితే ఆమె మౌఖికంగానే ఫిర్యాదు చేశారని, సమగ్ర వివరాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని సీఐ మనోహర్ తెలిపారు.

అందని ప్రయోజనాలు.. పెన్షనర్ల దిగాలు

- మూడునెలలుగా మట్టి ఖర్చులనూ అందించని చంద్రబాబు సర్కారు
- పేరుకుపోయిన గ్రాట్యుటీ, ఈఎల్ బకాయిలు
- నేడు కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల ధర్నా

❐ రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న మల్లికార్జున (పేరు మార్చాం) గత ఏడాది నవంబరులో ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు గ్రాట్యుటీ రూ.16 లక్షలు, ఈఎల్ (ఎర్న్ లీవ్) డబ్బు సుమారు రూ.10 లక్షలు నేటికీ అందలేదు. ఉద్యోగ విరమణ తరువాత పింఛను తప్ప ఇతర ఆర్థిక ప్రయోజనాలు నేటికీ తనకు అందలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

❐ ఒక ఉపాధ్యాయుడు గత ఏడాది అక్టోబరులో ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు గ్రాట్యుటీ రూ.16 లక్షలు, ఈఎల్ రూ.12 లక్షలు నేటికీ అందలేదు. ఉద్యోగ విరమణ చేసి తొమ్మిది నెలలు అవుతున్నా బెనిఫిట్లు అందించలేదని, ఇటీవల ఇంట్లో శుభకార్యం చేసేందుకు రూ.10 లక్షలు అవసరమైతే తెలిసిన వారి నుంచి వడ్డీకి డబ్బు తీసుకున్నానని వాపోయారు.

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పెన్షనర్ల పరిస్థితి దయనీయంగా మారింది. వారిపై బాబు సర్కారు కనికరం చూపడం లేదు. ఉద్యోగ విరమణ తరువాత రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను నెలలు గడుస్తున్నా అందించకపోవడంతో ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, ఎర్న్ లీవ్ వంటి ఆర్థిక ప్రయోజనాలు గత ఏడాది అక్టోబరు నుంచి పెండింగ్‌లో ఉంచారు. ఈ మొత్తం రూ.48 కోట్ల వరకు ఉంటుందని సమాచారం.



మట్టిఖర్చులూ పెండింగ్

పెన్షనర్ చనిపోతే అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు తక్షణ సాయంగా మట్టి ఖర్చుల (ఫ్యునరెల్ చార్జెస్) కింద రూ.25 వేలు ఇస్తారు. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ 100 మంది వరకూ పెన్షనర్లు మరణిస్తే వీరికి సంబంధించి మట్టి ఖర్చులను ఇవ్వకుండా ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచినట్లు తెలిసింది. 100 మందికి రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. మట్టిఖర్చుల కింద తక్షణ సాయంగా అందించాల్సిన డబ్బునూ పెండింగ్‌లో పెట్టడం ప్రభుత్వ కర్కశత్వానికి అద్దం పడుతోంది.

గ్రాట్యూటీ, ఈఎల్‌కు ఎదురుచూపులు

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రభుత్వం గ్రాట్యుటీ కింద గరిష్టంగా రూ.16 లక్షలు చెల్లిస్తుంది. జిల్లాలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు వివిధ హోదాల్లో దాదాపు 200 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసినట్లు సమాచారం. వీరికి సంబంధించి గ్రాట్యుటీ సగటున రూ.14 లక్షలుగా చూసినా రూ.28 కోట్లు రావాల్సి ఉంటుంది.

- సర్వీసులో ఉండగా ఉద్యోగులు మిగుల్చుకున్న ఎర్న్ లీవ్‌లను (ఈఎల్) ఉద్యోగ విరమణ సమయంలో ప్రభుత్వానికి వెనక్కి ఇచ్చి వాటికి డబ్బులు తీసుకుంటారు. ఇలా ఒక్కో ఉద్యోగి దాదాపు 300 రోజులు (పది నెలలు) ఎర్న్ లీవులను వెనక్కి ఇస్తారు. ఒక్కో ఉద్యోగికి ఈఎల్‌కు సంబంధించి 10 నెలల వేతనం ప్రభుత్వం చెల్లించాలి. సగటున నెలకు రూ.లక్ష వేసుకున్నా పది నెలలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలుగా 200 మందికి రూ.20 కోట్లను ప్రభుత్వం గత తొమ్మిది నెలలుగా చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచిందని పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం (నేడు) కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ పెన్షనర్లు ధర్నాకు పిలుపునిచ్చారు.

నమ్మి మోసపోయాం



కూటమి నాయకుల మాటలు నమ్మి మోసపోయాం. ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్ తప్ప ఇతరత్రా ఆర్థిక ప్రయోజనాలు ప్రభుత్వం నుంచి అందడం లేదు. గత అక్టోబరు నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళుతున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా తలపెట్టాం.

– శీలా జయరామప్ప, ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం

బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి..

- తల్లిదండ్రుల వేడుకోలు



బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి శ్రీప్రియ

కళ్యాణదుర్గం రూరల్: చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని నిరుపేద తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. వివరాలు.. శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామానికి చెందిన సతీష్, నందిని దంపతులు బతుకు తెరువు కోసం కళ్యాణదుర్గం పట్టణానికి వలసవచ్చి సిద్దప్ప వంక కాలనీలో నివాసం ఉంటున్నారు. సతీష్ బేల్దారి పనులకు వెళుతుండగా.. నందిని టైలరింగ్ చేస్తూ చేదోడుగా నిలిచింది. వీరి కుమార్తె శ్రీప్రియ ఐదో తరగతి చదువుతోంది. కొన్ని రోజుల క్రితం ప్రమాదశాత్తు కిందపడిన శ్రీప్రియ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించిన ఫలితం లేకపోవడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని సెయింట్‌జాన్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇప్పటికే మూడుసార్లు బ్రెయిన్ సర్జరీ చేశారు. రూ.5లక్షలకు పైగా చికిత్స కోసం అప్పు చేశారు. మరో సర్జరీ కోసం రూ.7లక్షలు అవసరమని అక్కడి డాక్టర్లు తెలిపారు. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బంది పడుతున్న నిరుపేద తల్లిదండ్రులు తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు. సాయం చేయాలనుకునే మానవతావాదులు 83096 50726 నంబర్‌లో సంప్రదించాలని కోరుతున్నారు.

ఆటో బోల్తా - ఒకరి మృతి

- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

గుత్తి: ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. పామిడి మండలం ఎదురూరు గ్రామానికి చెందిన ఎరికలప్ప (70), వీరభద్రప్ప, తిమ్మప్ప కర్ణాటకలోని హోసపేటలో స్థిరపడ్డారు. వ్యక్తిగత పనిపై సోమవారం హోసపేట నుంచి రైలులో గుత్తి ఆర్‌ఎస్‌కు వచ్చిన వీరు, అక్కడి నుంచి ఎదురూరుకు ఆటోలో బయలుదేరారు. షేరింగ్ ఆటో కావడంతో వీరితో పాటు గుత్తికి చెందిన విజయలక్ష్మి, ఆర్‌ఎస్‌కు చెందిన రాజ్‌కుమార్, హరిజన రాజు కూడా అదే ఆటో ఎక్కారు. గుత్తి ఆర్‌ఎస్ రోడ్డులోని లక్ష్మమ్మ గుడి వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను డ్రైవర్ తప్పించబోగా అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎరికలప్ప, విజయలక్ష్మి, రాజ్‌కుమార్‌ను అనంతపురంలోని జీజీహెచ్‌కు అంబులెన్స్‌లో తరలిస్తుండగా కాసేపల్లి టోల్ ప్లాజా వద్దకు చేరుకోగానే ఎరికలప్ప మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



జీజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందిన ఎరికలప్ప

లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేయాలి

అనంతపురం అర్బన్: మహిళలపై లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధర్యంలో రూపొందించిన ప్రచార పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కలెక్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పని ప్రదేశాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, ఐసీడీఎస్ పీడీ నాగమణి, డీవీ విభాగం కౌన్సిల్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మినీ కాన్ఫరెన్స్ హాలులో కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సిబ్బందితో మాట్లాడుతూ... 'రెవెన్యూ, ఇతర ప్రభుత్వ సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

'అక్షర ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

జిల్లాలో 1,25,578 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా 'అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 'సేవ్ వాటర్- యూజ్ వాటర్' అనే వినూత్న కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టాలని ఆదేశించారు.

సీఎస్‌ఆర్ కార్యక్రమాలు చేపట్టండి

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావాలని జిల్లాలోని భారీ, మెగా పరిశ్రమల యాజమాన్యాలకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. సీఎస్‌ఆర్ కార్యక్రమాలపై కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. పీ4, ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్, జల్ శక్తి అభియాన్, జన్ భాగీదరి కింద చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో సీపీఓ అశోక్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస్ యాదవ్, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డ్వామా పీడీ సలీమ్‌బాషా, భూగర్భ జల శాఖ డీడీ మల్లికార్జున, టీబీ నియంత్రణ అధికారి గంగాధర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పాలకుల అలసత్వం.. ఆటో డ్రైవర్ల శ్రమదానం



ముదిగల్లు బైపాస్ రోడ్డుపై గుంతలను పూడుస్తున్న ఆటో డ్రైవర్లు

కళ్యాణదుర్గం రూరల్: ఓ బడా కాంట్రాక్టర్ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎన్నికల సమయంలో తాను అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను నిర్మిస్తానని అప్పట్లో ఆయన హామీనిచ్చారు. నియోజకవర్గ ప్రజలు నమ్మి ఓట్లేస్తే ఎమ్మెల్యేగా గెలిచాడు. 13 మాసాలు గడిచినా ఇప్పటి వరకూ నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడే కానీ రోడ్డు నిర్మించిన పాపాన పోలేదు. దెబ్బతిన్న రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల రహదారులు గోతుల మయమయ్యాయి. ఇక తమ ఎమ్మెల్యే స్పందించరని ఆలస్యంగా తెలుసుకున్న కొందరు యువకులు శ్రమదానంతో రోడ్డుపై గుంతలను పూడ్చే పని చేపట్టారు.

20 గ్రామాలకు వెళ్లే రహదారికి మరమ్మతులు

కళ్యాణదుర్గం నుంచి ముదిగల్లు, కోడిపల్లి, ముద్దినాయన పల్లితో పాటు సుమారు 20 గ్రామాలకు పైగా ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి పూర్తి అధ్వాన స్థితికి చేరుకుంది. ఎటు చూసిన గుంతలే కనిపిస్తుండడంతో మరమ్మతులు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆయా గ్రామస్తులు విన్నవించారు. అయినా ఎవరూ పట్టించుకోక పోవడంతో ఆటో డ్రైవర్లు స్పందించారు. సోమవారం పలువురు ఆటో డ్రైవర్లు ఏకమై చందాలు వేసుకుని ట్రాక్టర్‌లో కంకర్ వేస్టును తీసుకెళ్లి పట్టణ సమీపంలోని ముదిగల్లు బైపాస్ రోడ్డు నుంచి దాదాపు ఒక కిలోమీటర్ మేర రోడ్డుపై గుంతలను పూడ్చి వేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ... ఆటోల్లో ఈ మార్గంలో ఎక్కువగా మహిళలు, చిన్న పిల్లలు ప్రయాణం చేస్తుంటారన్నారు. కొన్ని రోజుల క్రితం ఆటోలో గర్భిణిని ఆస్పత్రికి తరలించే సమయంలో పరిస్థితి విషమించిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

తాగునీటి సమస్య తీర్చాలని నిరసన



సచివాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న మహిళలు

కుందుర్పి: మండలంలోని బసాపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మహిళలు సచివాలయానికి తాళం వేసి గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. వారం రోజులుగా గ్రామానికి తాగునీరు అందడం లేదని, అధికారులను అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని వాపోయారు. తాగునీరు అందించే వరకూ సచివాలయం తలుపు తీయరాదని భీష్మించారు. ఎంపీడీఓ లక్ష్మీశంకర్ స్పందించి 24గంటల్లో సమస్య పరిష్కరిస్తామని హామీనివ్వడంతో ఆందోళనను విరమించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

శింగనమల: ఇంటి రస్తా విషయంలో శింగనమల మండలం ఇరువెందలలో చోటు చేసుకున్న వ్యక్తి హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. శింగనమల పీఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. ఇరువెందుల గ్రామానికి చెందిన మైలే శంకరయ్యకు వరుసకు మనవరాలైన శ్యామల ఈ నెల 3న మధ్యాహ్నం 1 గంటకు తన ఇంటికి వెనుక ఉన్న దారికి ముళ్ల కంప అడ్డు వేసింది. ఈ విషయంగా దాసరి ప్రభాకర్ భార్య సరస్వతి, తల్లి రత్నమ్మ గొడవపడ్డారు. సాయంత్రం 6 గంటలకు ఇంటికి చేరుకున్న ప్రభాకర్‌కు విషయాన్ని భార్య, తల్లి తెలపడంతో ఆగ్రహానికి గురైన ఆయన తన తమ్ముడు త్రినాథ్, బంధువులు రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులు, సరస్వతి, రత్నమ్మతో కలసి కర్రలు, రాళ్లతో శంకరయ్య ఇంటి వద్దకు చేరుకున్నారు. శ్యామల భర్త మల్లికార్జున ఎక్కడ అంటూ దుర్భాషలాడుతుండగా శంకరయ్య నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. అంతలో ప్రభాకర్‌తో పాటు త్రినాథ్, రమేష్, శేఖర్, నాగేంద్ర, రామచంద్ర, శ్రీనివాసులు, సరస్వతి, రత్నమ్మ మూకుమ్మడిగా శంకరయ్య, బాలగంగిరెడ్డి, నాగేంద్ర, అమ్ములన్న, పెద్దరాజుపై రాళ్లతో, కర్రలతో దాడి చేశారు. ఘటనలో శంకరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై హత్య కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం పక్కా ఆధారాలతో నాయనపల్లి క్రాస్ వద్ద ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో, సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ విజయ్‌కుమార్, ఏఎస్‌ఐ చితంబరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని వివిధ విభాగాల్లో బోధనకు అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను చరిత్ర, ఆర్కియాలజీ, బయో కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, కామర్స్ అండ్ మేనేజ్మెంట్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. ఈ నెల 16న ఇంటర్వ్యూలు ఉంటాయి. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఉదయం 10 గంటలకు కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్ లో వివరాలు నమోదు చేసుకోవాలి. మధ్యాహ్నం 2 గంటల నుంచి రూమ్ నంబర్ 14లో ఇంటర్వ్యూలు చేపడతారు. యూజీసీ నిబంధనలు అనుసరించి భర్తీ ప్రక్రియ కొనసాగుతుంది. పీహెచ్‌డీ, నెట్, స్లెట్, పీజీ పూర్తి చేసిన వారు అర్హులు. అభ్యర్థులు బయోడేటా, విద్యకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంట తీసుకెళ్లాలి.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



పెద్దిరెడ్డి (ఫైల్)

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లికి చెందిన కౌలు రైతు పెద్దారెడ్డి(50) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆయనకు భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్షుంపల్లికి చెందిన ఓ రైతు తోటను కౌలుకు తీసుకుని ఎనిమిది ఎకరాల్లో చీనీ పంట సాగు చేశాడు. ఆదివారం రాత్రి పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లినా ఆయన మోటారుకు అమర్చిన విద్యుత్ తీగల కొక్కీలను తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భార్యాపిల్లలు అక్కడకు చేరుకుని విగతజీవిగా పడి ఉన్న పెద్దారెడ్డిని చూసి బోరున విలపించారు. కుమారుడు సాయిప్రతాపరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బుక్కరాయసముద్రం: మండలంలోని గుత్తి రోడ్డు సమీపంలోని తడకలేరు వంకలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని బెంగళూరుకు చెందిన దేవరాజ్ (56)గా గుర్తించారు. అనంతపురానికి వచ్చిన ఆయన మూడు రోజుల క్రితం తడకలేరు వద్ద మృతి చెందినట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

రైతుల నగదు చోరీకి యత్నం

కళ్యాణదుర్గం రూరల్: ముగ్గురు రైతులకు చెందిన నగదును చోరీ చేసేందుకు ఓ ఆగంతకుడు విఫలయత్నం చేసిన ఘటన కళ్యాణదుర్గంలో చోటుచేసుకుంది. వివరాలు.. బెళుగుప్ప మండలం విరుపాపల్లికి చెందిన రైతు గోవిందప్పతో పాటు మరో ఇద్దరు రైతులు సోమవారం కళ్యాణదుర్గంలోని యూనియన్ బ్యాంక్ శాఖకు వచ్చారు. తమ పంట రుణాలను రెన్యూవల్ చేసిన అనంతరం ఖాతాలో నుంచి రూ.6 లక్షలు విత్‌డ్రా చేసి గోవిందప్పకు అప్పగించి, మిగిలిన ఇద్దరు పనిపై వెళ్లిపోయారు. నగదును గోవిందప్ప తన ద్విచక్ర వాహనం సైడ్ బ్యాగ్‌లో ఉంచి విద్యుత్ కార్యాలయం సమీపంలోని హోటల్‌లోకి వెళ్లి భోజనం చేస్తూ తన వాహనంపై నిఘా ఉంచాడు. కాసేపటికి ఓ యువకుడు ద్విచక్ర వాహనంలోని నగదును అపహరించే ప్రయత్నం చేయగా గట్టిగా కేకలు వేయడంతో నగదు అక్కడే పడేసి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సీసీ పుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు.

జేఎన్‌టీయూలో 1,935 సీట్ల తగ్గింపు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలోని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల పరిధిలో సీట్ల ఖరారు పూర్తయింది. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో మొత్తం 69 అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు గాను ఈ విద్యాసంవత్సరానికి 59,244 సీట్లు ఏఐసీటీఈ మంజూరు చేసింది. కళాశాలల నిజనిర్ధారణ కమిటీల సిఫార్సు మేరకు 1,935 సీట్లను తగ్గిస్తూ మొత్తం 57,309 ఇంజినీరింగ్ సీట్లను ఖరారు చేశారు. వీటిని ఏపీఈఏపీసెట్ -2025 వెబ్ ఆప్షన్ల ఎంపికకు అందుబాటులో తెచ్చేందుకు ఉన్నత విద్యామండలికి నివేదించారు. బీబీఏ, బీసీఏ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ కోర్సులకు సంబంధించి 77,296 సీట్లకు ఏఐసీటీఈ ఆమోదం తెలపగా, 74,145 సీట్లను భర్తీ చేసుకునేందుకు వర్సిటీ తుది ఆమోదం తెలిపింది.

జేఎన్‌టీయూలో కొత్త కోర్సు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త కోర్సు అమలు చేస్తున్నట్లు వీసీ హెచ్.సుదర్శనరావు సోమవారం వెల్లడించారు. వర్సిటీ పరిధిలోని అన్ని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు త్వరలో అటానమస్ హోదా దక్కనున్న నేపథ్యంలో క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాల్సిన అనివార్య పరిస్థితి నెలకొంది. అయితే కొత్త కోర్సులను ప్రవేశపెట్టడంలో జాప్యం నెలకొని పేద, మధ్య తరగతి విద్యార్థులు క్యాంపస్‌లో చదివే అవకాశం లేకుండా పోతోంది. ఈ అంశంపై 'విశ్వ ఖ్యాతి.. అధోగతి' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై వీసీ స్పందించారు. ఉన్నత విద్యామండలితో ఫోన్‌లో సంప్రదించి కొత్త కోర్సు అమలుకు చర్యలు తీసుకున్నారు. ఏపీ ఈఏపీసెట్ -2025 వెబ్ ఆప్షన్లలో ఈ కొత్త కోర్సును ఎంపిక చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తెచ్చారు.


కొత్త కోర్సు వివరాలు ఇలా:

జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ అనే కొత్త కోర్సును సెల్ఫ్ ఫైనాన్స్ కింద ప్రవేశపెట్టారు. కన్వీనర్ కోటాలో 66 సీట్లను కేటాయించారు. కోర్సు ఫీజు రూ.75 వేలుగా నిర్ధారించారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది.


- కంప్యూటర్ సైన్సెస్‌లో ప్రస్తుతమున్న సీట్లకు అదనంగా 66 సీట్లు కొత్తగా కేటాయించారు. ఒక్కో సీటుకు రూ.1.50 లక్షలుగా నిర్ధారించారు. సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరిలో ఈ సీట్లు కేటాయిస్తారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు.
- ఈసీఈలో ఇప్పుడు ఉన్న సీట్లకు అదనంగా 66 సీట్లు కేటాయించారు. ఒక్కో సీటుకు కోర్సు ఫీజు రూ.1.25 లక్షలుగా నిర్దేశించారు. వీటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదు. ఈ కోర్సులన్నింటినీ 2025-26 విద్యా సంవత్సరంలో అమల్లోకి తెచ్చారు. బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వర్తిస్తుంది.

గిరినాథ్‌కు రూ.10 లక్షలు

- ఏపీఎల్‌లో అత్యధిక ధరతో వేలం
- జిల్లాకు చెందిన 11 మంది క్రికెటర్లకు అవకాశం



గిరినాథరెడ్డి



వినయ్ కుమార్

అనంతపురం: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) 2025 వేలం ప్రక్రియ విశాఖపట్నంలో సోమవారం రాత్రి ముగిసింది. ఏపీఎల్ సీజన్-4 కోసం 520 మంది క్రికెటర్లు వేలంలో పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో అనంతకు చెందిన 11 మంది క్రీడాకారులకు అవకాశం దక్కింది. అత్యధికంగా పి.గిరినాథరెడ్డిని రూ.10.05 లక్షలతో రాయల్స్ ఆఫ్ రాయలసీమ (ఆర్‌ఆర్) దక్కించుకుంది. రూ.7.50 లక్షలకు బి.వినయ్‌కుమార్‌ను అమరావతి రాయల్స్ సొంతం చేసుకుంది. రూ.4.20 లక్షలకు కోగటం హనీష్ వీరారెడ్డిని సింహాద్రి వైజాగ్ లయన్స్ కైవసం చేసుకుంది. పి.అర్జున్ టెండూల్కర్‌ను రూ.1.20 లక్షలకు కాకినాడ కింగ్స్, మచ్చా కె.దత్తారెడ్డిని రూ.60 వేలకు తుంగభద్ర వారియర్స్, జి.మల్లికార్జునను రూ.90 వేలతో అమరావతి రాయల్స్, సంతోష్‌కుమార్‌ను రూ.60 వేలతో అమరావతి రాయల్స్, ఎస్‌ఎం కమిల్‌ను రూ.50 వేలతో సింహాద్రి వైజాగ్ లయన్స్, ఎస్.మనోజ్‌కుమార్‌ను రూ.30 వేలతో రాయల్స్ ఆఫ్ రాయలసీమ, డీబీ ప్రశాంత్‌ను రూ.2.20 లక్షలు, ఎం.దీపక్‌ను రూ.30 వేలతో తుంగభద్ర వారియర్స్ దక్కించుకున్నాయి.

క్లుప్తంగా

బీబీ పాతిమా పీర్ల జాతర ప్రారంభం



పెట్టెను ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: బీబీ ఫాతిమా చిన్నపీర్ల జాతర సోమవారం ప్రారంభమైంది. స్థానిక 5వ రోడ్డులోని మకానం నుంచి సాయంత్రం పెట్టె మెరవణి నభాజీ భజంత్రీల నడుమ సందడిగా సాగింది. ఈనెల 20 వరకు సాగే వేడుకలకు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. బీబీ ఫాతిమ బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ.. మొదటి రెండు రోజులు మకానం వద్ద నిత్య పూజలు జరుగుతాయన్నారు. 17న చిన్నసరిగెత్తు, అదేరోజు రాత్రి మెరవణి, 19న పెద్ద సరిగెత్తు, పానకాలు, 20న ఉదయం అగ్నిగుండ ప్రవేశం ఉంటాయన్నారు. 22న చివరి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. రోజూ చక్కెర చదివింపులు ఉంటాయని తెలిపారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ పరిశీలన



ఓవర్‌హెడ్ ట్యాంక్ సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ల్యాబ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ చీలికలు వచ్చి ప్రమాదకరంగా మారింది. స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడంతో సాక్షిలో 'కూలేందుకు సిద్ధం.. కదలని దస్త్రం' శీర్షికతో కథనం ప్రచురమైంది. సోమవారం జేఎన్టీయూ ల్యాబ్ అధికారులు యోగేశ్వర్, నల్లప్ప, ఆర్‌డబ్ల్యూ ఏఈ శివకుమార్ ఓవర్ హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ల్యాబ్ నుంచి తెచ్చిన పరికరాలతో ట్యాంక్ సామర్థ్యాన్ని పరిశీలించారు. ట్యాంక్ ఎంత మేరకు ఉండగలదో మూడు రోజుల్లో పూర్తి నివేదికలు అందజేస్తామని తెలిపారు.


వృద్ధాశ్రమాన్ని పరిరక్షించాలి



కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న వృద్ధులు, నిర్వాహకులు

అనంతపురం అర్బన్: కూడేరు మండలం గొట్కూరు పరిధిలో ఉన్న బెరాకా వృద్ధాశ్రమాన్ని పరిరక్షించాలంటూ వృద్ధులు, నిర్వాహకులు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శ్రీరాములు మాట్లాడుతూ.. ఆశ్రమానికి 2009లో గొట్కూరు అటవీ ప్రాంతంలో సర్వే నంబర్ 69–4లో రెండు ఎకరాల స్థలాన్ని అప్పటి కలెక్టర్ అనుమతితో ఇచ్చారన్నారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు లేవంటూ తహసీల్దార్ ఆశ్రమాన్ని కూల్చివేయిస్తున్నారని తెలిపారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు.

రూ.7.25 లక్షల ఎరువులకు స్టాప్‌సేల్స్



ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: సరైన డాక్యుమెంట్లు లేకుండా నిల్వ చేసిన రూ.7.25 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు అనంతపురం రూరల్ మండల వ్యవసాయాధికారి వెంకట్‌కుమార్ తెలిపారు. వ్యవసాయశాఖ కమిషనరేట్ ఆదేశాల మేరకు జిల్లాకు వచ్చిన ఏడీఏ సాల్‌రెడ్డి, విజిలెన్స్ ఎస్‌ఐ నరేంద్రభూపతి, జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏఓ వంశీకృష్ణతో కలసి నగరంలోని మూడు ఎరువుల దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు చేపట్టారు. ఫారం 'ఓ' లేకుండా ఎరువులు నిల్వ చేసి విక్రయాలు సాగిస్తున్నట్లుగా గుర్తించారు. 10 రోజుల్లోపు డాక్యుమెంట్లు ఇవ్వకపోతే... వాటిని సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామని దుకాణాదారులను హెచ్చరించారు.

నేడు మండల సమావేశం

కనగానపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనిల్ కుమార్ తెలిపారు. ఎంపీపీ భాగ్యమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు స్థానిక సర్పంచులు, మండల స్థాయి అధికారులంతా తప్పక హాజరుకావాలని సూచించారు.

పొగ ముప్పు

- నరసనాయనికుంట సమీపంలో 'డంపింగ్ యార్డు' ఏర్పాటుకు స్థల పరిశీలన
- ప్రజల ఆరోగ్యంతో పాటు సాగు చేసుకుంటున్న భూములపై తీవ్ర ప్రభావం
- డంపింగ్ యార్డును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు
- మొండిగా ముందుకెళ్తున్న అధికారులు
- పట్టించుకోని రాప్తాడు, అనంతపురం ఎమ్మెల్యేలు



ఎన్ఎస్ కుంట సమీపంలో డంపింగ్‌యార్డు కోసం పరిశీలించిన భూమి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట, నాగిరెడ్డిపల్లి గ్రామాలకు 'పొగ' ముప్పు పొంచి ఉంది. అనంతపురం నగర శివారులోని గుత్తి రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్‌ను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు అడుగులు వేస్తున్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో పర్యావరణాన్ని దెబ్బతీయడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందంటూ ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులు పలుమార్లు పర్యటించి భూమిని పరిశీలించారు. చివరకు కలెక్టర్ వినోద్‌కుమార్ సైతం వెళ్లి అక్కడి భూములను పరిశీలించారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో కలిగే ఇబ్బందులను ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కలెక్టర్‌కు ఏకరువు పెట్టారు. అయినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన గ్రామస్తులు..

డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాల ప్రజలు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిశారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో ఎదురయ్యే సమస్యలను విన్నవించారు. అయితే ఎమ్మెల్యేలు మాత్రం ఎవరికీ ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ప్రజలకు చెబుతున్నారు.

డంపింగ్ యార్డు నుంచి వచ్చే వ్యర్థాలు భూమి, నీరు, గాలిని కలుషితం చేస్తాయి. అలాగే వెలువడే విష వాయువులు, దుర్వాసనతో ప్రజలు శ్వాసకోశ, చర్మ వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. 263 సర్వే నంబరులో దాదాపు 25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇదంతా గుట్ట పోరంబోకే. పెద్దపెద్ద గుండ్లను తొలిగించి భూములు లేని ఎస్సీ, ఎస్టీలు చదును చేసి సాగు చేసుకుంటున్నారు. ఇలాంటి భూములపై అధికారుల కన్ను పడిందని బాధితులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ పెట్టకుండా అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అడ్డుకున్నారని చెబుతున్నారు.

ఇళ్ల పట్టాలకు దొరకని భూములు

రూరల్ మండలంలో దాదాపు ఆరు వేల మంది, అర్బన్ పరిధిలోనూ దాదాపు 5 వేల మంది అర్హులకు ఇంటి పట్టాలు ఇవ్వాల్సి ఉంది. ఇంటి పట్టాలకే అనువైన భూములు లేక ఇబ్బందులు పడుతుంటే.. ఇంత అనువైన ప్రదేశంలో డంపింగ్ యార్డు పెట్టాలని చూస్తుండటంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 20–25 కిలో మీటర్ల దూరంలో కొండల్లో పెట్టుకుంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. లేదా ప్రస్తుతం ఉన్నచోటే రీసైక్లింగ్ చేయొచ్చు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. చెత్తను రీసైక్లింగ్ చేసి.. బయోగ్యాస్ ఫ్యూయెల్, థర్మల్ పవర్‌ప్లాంట్ తదితర వాటికి ఉపయోగిస్తారు. ఇందులో నుంచి ఒకరకం పౌడర్ సిమెంట్ తయారీకి వినియోగిస్తారు.

మేమెక్కడ స్థలం చూపించాలి?



డంపింగ్ యార్డు ఏర్పాటు కోసం రోజుకొక అధికారి వచ్చి భూములు చూసి వెళ్తున్నారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే పంటలపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆరోగ్యాలపై కూడా ప్రభావం ఉంటుందని చెబుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లు, మునిసిపల్ అధికారులకు విన్నవించాం. మీరే ఎక్కడైనా భూములు చూపించమని మాట్లాడుతున్నారు. మేమెక్కడ చూపించాలి. లేదంటే మా ఇళ్ల స్థలాలనే చూపించాలి.

– శంకర్‌నాయక్, నరసనాయనికుంట

ఎవరూ పట్టించుకోవడం లేదు



గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ప్రజలతో పాటు మూగ జీవాలు, వ్యవసాయ పంటలపై ప్రభావం పడుతుంది. మేము పడే ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి ఏకరువు పెట్టినా ఎవరూ పట్టించుకోలేదు. అధికారులైతే యార్డు ఏర్పాటుకు మొండిగా ముందుకెళ్తున్నారు. చుట్టపక్కల గ్రామాల ప్రజలందరూ కలిసికట్టుగా అడ్డుకుని తీరుతాం.

– వడ్డే ఆనంద్, మాజీ డీలర్, నరసనాయనికుంట

అభివృద్ధి పనులకు జీఓలు చూపిస్తారా?



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అభివృద్ధి చేయకపోగా.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన కార్యక్రమాలను తన ఖాతాలో వేసుకుంటూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని' మేయర్ వసీం ధ్వజమెత్తారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడారు. సాక్షాత్తు నా చాంబర్‌లోకి టీడీపీ చోటా నాయకులు దూరి హల్‌చల్ చేశారని, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధును చితకబాదిన విషయాన్ని గుర్తు చేశారు. సుపరిపాలన కార్యక్రమంలో రూ.118 కోట్ల అభివృద్ధి చేశామని, అందులో రూ.31 కోట్లు సాధారణ నిధులు, రూ.15 కోట్లు ఎన్ క్యాప్, రూ.12 కోట్లు డంప్‌యార్డుకు వెచ్చించినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి తప్పుడు కూతలు కూస్తున్నారన్నారు. రుద్రంపేట రోడ్డు, నారాయణపురం బ్రిడ్జ్ తానే నిర్మించినట్లు, పంగల్ రోడ్డు నుంచి బళ్లారి బైపాస్ వరకు ఫోర్ లైన్ రోడ్డు టీడీపీ హయాంలోనే వేసినట్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 2023 డిసెంబర్ 15న నారాయణపురం బ్రిడ్జ్ నిర్మాణానికి, 2021 జులై 27న రుద్రంపేట రోడ్డుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన జీఓలను మీడియాకు చూపించారు. అభివృద్ధికి సంబంధించి ఒక్క జీఓ అయినా చూపించండి అంటే అస్తమానం ఊగిపోతూ వ్యక్తిగత విమర్శలు చేసి దిగజారిపోతున్నారన్నారు.

211 పనులు ఆపిందెవరు?

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 211 అభివృద్ధి పనులు మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని కుట్రపూరితంగా ఆపిందెవరో చెప్పాలని ఎమ్మెల్యే దగ్గుపాటిని మేయర్ ప్రశ్నించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు, బీసీ విభాగం నగరాధ్యక్షుడు లక్ష్మన్న ధ్వజమెత్తారు. చీమల పుట్టలో పాములా చేరి సంపదను దోచుకుంటున్నారన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపారు. నగర అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సమావేశంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇషాక్, రహంతుల్లా, అనిల్‌కుమార్ రెడ్డి, సంపంగి రామాంజినేయులు, కో ఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, నాయకులు రామచంద్ర, దాదు, రియాజ్, కుళ్లాయస్వామి, మహబూబ్‌బాషా, కాకర్ల శీన, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలతో అట్టుడికిన కలెక్టరేట్



కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై కూర్చొని ధర్నా చేస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు



వేతనం, పీఎఫ్ చెల్లించాలని కోరుతున్న శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టు కార్మికులు

అనంతపురం అర్బన్: సమస్యల పరిష్కారంలో అంతులేని నిర్లక్ష్యం వహిస్తున్న కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ప్రాంతం దద్దరిల్లింది. జిల్లాలోని బీసీ, ఎస్టీ, ఎస్సీ, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ గేటు ఎదుట వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు ధర్నా చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా వర్కర్ల సంఖ్య పెంచాలన్నారు. నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలన్నారు. ధరలకు అనుగుణంగా మెనూ చార్జీ పెంచాలని, మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబాఇమామ్, వరుణ్‌కుమార్, రాహుల్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, అశోక్‌కుమార్, వంశీనాయుడు పాల్గొన్నారు. అలాగే నిరుద్యోగ భృతి చెల్లించాలంటూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంతోష్‌కుమార్, నాయకులు ధనుంజయ, దేవేంద్ర, శ్రీనాథ్, శ్రీనివాస్, ఆనంద్, రాంబాబు, లిఖిల్, మెజీర్, కన్నా, తదితరులు పాల్గొన్నారు. వేతన, పీఎఫ్ బకాయిలు చెల్లించాలంటూ శ్రీరామరెడ్డి తాగునీటి కార్మికులు చేపట్టిన ధర్నాలో కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు జి.ఓబుళు, ఎర్రిస్వామి, నాయకులు ఈశ్వర్, చిక్కన్న, బాబు, తదితరులు పాల్గొన్నారు. 1986లో తాము కొనుగోలు చేసిన ప్లాట్లను ఇతరుల పేరుపై రిజిస్ట్రేషన్ చేశారని, సమస్య పరిష్కరించి ఆదుకోవాలంటూ తాడిపత్రి ప్రాంతానికి చెందిన బాధితులు యశోద, విజయకుమార్‌రెడ్డి, మహబూబ్‌బాషా, లక్ష్మీదేవి, హాజీవలి, కరీనాబేగం, రాణి, సుధాకర్, బాలనరసమ్మ, సలీమ్, సుబాన్, తదితరులు నిరసన వ్యక్తం చేశారు.

ప్రత్యేక రాయలసీమ మా నినాదం



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకట సుబ్బారెడ్డి

అనంతపురం అర్బన్: ప్రత్యేక రాయలసీమ ఏర్పాటుతోనూ సీమ అభివృద్ధి సాధ్యమని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచెం వెంకట సుబ్బారెడ్డి అన్నారు. ఇదే నినాదంతో సీమ వ్యాప్తంగా కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెల 13న నగరంలోని ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన సమితి ప్లీనరీ ప్రత్యేక రాయలసీమ సాధనపై విస్తృతంగా చర్చించామన్నారు. రాయలసీమ అభివృద్ధికి, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు, పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు, సీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించి 17 తీర్మానాలు చేశామన్నారు. వీటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్ఎస్‌బీఎన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసి, ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ విద్యాసంస్థల మాదిరిగానే ఈ ఎయిడెడ్ విద్యాసంస్థలను చూస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక విద్యా సంస్థలను నీరుగార్చే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎయిడెడ్ విద్యాసంస్థలు మీద కపట ప్రేమ చూపించిన లోకేష్.. నేడు విద్యాశాఖ మంత్రిగా ఉండికూడా ఎలాంటి ఉపయోగం లేదన్నారు. వెంటనే ఎస్ఎస్‌బీఎన్ ఇతర ఎయిడెడ్ విద్యాసంస్థలకు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కన్వీనర్ రజిత, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు తరిమెల గిరి, నాయకులు విజయ్, సాయి, కిరణ్, జస్వంత్, వరుణ్, బన్నీ, చరణ్ పాల్గొన్నారు.

యువకుడిపై వేటకొడవలితో దాడి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని కాల్వగడ్డ వీధిలో టైలర్స్ కాలనీకి చెందిన హర్ష అనే యువకుడిపై సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆరుగురు వ్యక్తులు ద్విచక్రవాహనాలపై వచ్చి తలపై వేటకొడవలితో నరికారు. నరికిన తర్వాత వారు పారిపోయరని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన హర్షను ఆసుపత్రికి తరలించారు. దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వడ్డీ వ్యాపారుల నుంచి రక్షించండి

అనంతపురం: వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి తమను కాపాడాలని, వారి నుంచి తమ కుమారుడికి ప్రాణహాని ఉందంటూ ఎస్పీ పి.జగదీష్‌కు బాధితులు విన్నవించారు. బాధితులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని అశోక్‌నగర్‌లో నివాసముంటున్న పి.వెంకట్రామిరెడ్డి, పి.రేణుక దంపతులు అశోక్‌నగర్ మెయిన్ రోడ్డు బ్రిడ్జి వద్ద టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి తెలియకుండా వారి కుమారుడు పి.అభిషేక్‌రెడ్డికి ఎరికల రవికుమార్ అనే వ్యక్తి విడతల వారీగా రూ.3.3 లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఇందుకు గాను రెండు ఖాళీ చెక్కులను తీసుకున్నాడు. వారానికి నూటికి రూ.10 చొప్పున రూ.33 వేలు వడ్డీని అభిషేక్‌రెడ్డి సక్రమంగా చెల్లించాడు. ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందుల కారణంగా వడ్డీ చెల్లించలేక ఇబ్బంది పడుతుంటే రవికుమార్ నేరుగా అభిషేక్‌రెడ్డి తల్లిదండ్రులను నిలదీశాడు. తరచూ హోటల్ వద్దకెళ్లి గొడవ పడుతుండడంతో జూన్ 16న రవికుమార్ ఖాతాకు రూ.2 లక్షలు జమ చేశారు. అప్పు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకూ మొత్తం రూ.5.60 లక్షలు చెల్లించినా మరింత కట్టాలంటూ రవికుమార్, అతని అనుచరులు భరత్‌సాయి, హుస్సేన్, రవి, హరీష్, మహేష్, రాము తదితరులు రోజూ ఇంటి వద్ద, హోటల్ వద్ద దుర్భాషలాడుతూ దౌర్జన్యాలు సాగిస్తున్నారు. ఆడవారని కూడా చూడకుండా ఇబ్బంది పెడుతున్నారు. కుమారుడిని చంపుతామని బెదిరిస్తున్నారు. వారి నుంచి తమ కుమారుడికి ప్రాణహాని ఉందని, ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్పీకి విన్నవించినట్లు బాధితులు తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో ఉద్యోగ అవకాశాలు

అనంతపురం: కేంద్ర మానవ వనరుల, క్రీడా మంత్రిత్వ శాఖతో గుర్తింపు పొందిన హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో మంచి అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిషనర్ తుంగ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. యోగా, మెడిటేషన్, డ్రిల్, ఆత్మరక్షణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, సేవా కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్, క్లీన్ అండ్ గ్రీన్, పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు, మెడికల్ క్యాంపుల్లో పాల్గొంటే ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. హిందూస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పేరిట ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 2023లో జేఎన్టీయూ అనంతపురంలోనూ చౌడికి కృష్ణ అనే వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తామని అక్రమంగా నిరుద్యోగుల వద్ద నగదు వసూలు చేశాడనే అంశంపై ఏఐఎస్ఎఫ్ నాయకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారన్నారు.

ఇంటింటా చెత్త సేకరించాలి



చెత్తను సేకరిస్తున్న పంచాయతీ కార్మికులు

రాప్తాడు: ఇంటింటా తడి, పొడి చెత్తను పకడ్బందీగా సేకరించాలని ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇంటింటా తిరిగి పంచాయతీ కార్మికులు చెత్తను సేకరిస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. పరిసరాల అపరిశుభ్రంగా ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. పంచాయతీ కార్మికులు వారికి కేటాయించిన ఇళ్లల్లో ప్రతి రోజూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. సేకరించిన చెత్త ద్వారా వర్మి కంపోస్ట్ ఎరువును తయారు చేసి రైతులకు సేంద్రియ ఎరువులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్ కుమార్, వెంకట రమణ రెడ్డి, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'లీడర్‌షిప్' శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ శైలజ

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించే 'లీడర్‌షిప్' అంశంపై నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణ సోమవారం ప్రారంభమైంది. బుక్కరాయసముద్రం సమీపంలోని విజయభారతి బీఈడీ కళాశాలలో జరిగిన శిక్షణను సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా ఈ శిక్షణను తీసుకుందన్నారు. ప్రధానోపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణకు జిల్లా వ్యాప్తంగా 235 మంది ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు బి.సురేష్ పాల్గొన్నారు. ఎంఈఓ–2లు గురుప్రసాద్, లింగా నాయక్ కోర్సు డైరెక్టర్లుగా వ్యవహరించారు. సమగ్ర శిక్ష ఏఎంఓ వేణుగోపాల్ శిక్షణను పర్యవేక్షిస్తున్నారు.

వీకే పార్వతమ్మ మృతికి సంతాపం



వీకే పార్వతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుడు వీకే ఆదినారాయణరెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ మృతికి సీపీఎం నాయకులు సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. స్థానిక ఒకటో రోడ్డులోని స్వగృహంలో పార్వతమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబుళు, జిల్లా కార్యదర్శి నల్లప్ప, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సావిత్రి మాట్లాడారు. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో పార్వతమ్మ క్రియాశీలంగా పని చేశారన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. భర్తకు తోడుగా ఉంటూ కార్యకర్తలు, నాయకులను కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి, చంద్రిక, తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దౌర్జన్యాలు ఆపాలి



జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు

అనంతపురం: దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు ఆపాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్పీ జగదీష్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో మొహర్రం పండుగ వేడుకల్లో దళితులను దూషించిన వారిపై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఎస్‌ఐ సమక్షంలోనే దళితులను కించపరుస్తూ.. నానా దుర్భాషలాడినా మౌనంగా ఉండటం సరికాదన్నారు. ఒకే గ్రామంలో ఒకే పండుగలో రెండు రకాల అనుమతులు ఎవరిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారం రోజులైనా కేసు కట్టకపోగా.. విచారణ జరపలేదంటే దళితులకు కల్పిస్తున్న రక్షణ అర్థమవుతోందన్నారు. దళితులను దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బండారు సురేష్ బాబు, దాసరి రామాంజినేయులు, అశోక్, రామాంజనేయులు, గుమ్మనూరు నాగరాజు, పుల్లయ్య, మధు, భార్గవ్, రఘు, వన్నూరు స్వామి, దావీద్ తదితరులు పాల్గొన్నారు.